క్లుప్తంగా

ఎంపీడీఓగా వీవీ సుబ్బయ్య


ఎంపీడీఓను సన్మానిస్తున్న ఈఓఆర్‌డీ, పంచాయితీ కార్యదర్శులు

సంజామల: మండల అభివృద్ధి అధికారిగా వీ.వెంకట సుబ్బయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉన్న ఎంపీడీఓ సాల్మన్ చిత్తూరు జిల్లా ఎంపీడీఓల శిక్షణకు వెళ్లారు. ఆళ్లగడ్డలో మండల విస్తరణ అధికారిగా పని చేస్తున్న వివి సుబ్బయ్యకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. విధుల్లో చేరిన ఆయనకు ఈఓఆర్‌డీ రాధికరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు స్వాగతం పలికి అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ


రమణారెడ్డి

మండల విద్యాధికారిగా పీవీ రమణారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఈఓ-1 రాజయ్య గురువారం పదవీ విరమణ పొందుతున్న నేపథ్యంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ-1గా రమణారెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలకు ప్లేట్ల వితరణ


విద్యార్థులకు ప్లేట్లను అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండలపరిధిలోని గోర్లగుట్ట జెడ్పీ హైస్కూలు, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి 100 ప్లేట్లను వితరణ చేశారు. బుధవారం గ్రామానికి చెందిన తలారి నాయుడు జ్ఞాపకార్థం కుమార్తె స్వర్ణలత, అల్లుడు ఫిజికల్ డైరెక్టర్ రంగనాయకులు, కుటుంబ సభ్యులు ప్లేట్లను విద్యార్థులకు అందజేశారు. దాతలను పాఠశాలల హెచ్‌ఎంలు మద్దిలేటిరెడ్డి, కృష్ణయ్యలు అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: స్థానిక ఇండోర్ స్టేడియం సమీపంలోని పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి..సిబ్బందితో దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 38 వేల నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అన్నపై తమ్ముడి దాడి

బేతంచెర్ల : మండల పరిధిలోని పాపసాని కొట్టాల గ్రామానికి చెందిన రామతిమ్మారెడ్డిపై అతని తమ్ముడు తిమ్మారెడ్డి, భార్య రమణమ్మ పొలం రస్తా విషయంలో గొడవ పెట్టుకొని దాడి చేసి గాయపరిచారు. బాధితుడు రామతిమ్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ బాబు బుధవారం తెలిపారు.

జామియా మసీదు మౌజన్ మృతి


హిదాయత్ అలీ

బేతంచెర్ల : పట్టణంలోని జామియా మసీద్ మౌజన్ హిదాయత్ అలీ (85) బుధవారం అనారోగ్యంతో మరణించారు. 16 సంవత్సరాల పాటు మసీదులో మౌజన్‌గా సేవలు అందించారని మండల ఖాజీ నూర్ అహ్మద్ తెలిపారు. పట్టణ ముస్లింలు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.

డీఎస్పీ కౌన్సెలింగ్‌తో తగ్గిన చికెన్ ధరలు

డోన్ టౌన్: కొద్ది నెలలుగా డోన్‌లో చికెన్ వ్యాపారస్తుల మధ్య నెలకొన్న వివాదాలకు తెరపడింది. డోన్‌లో కొంత మంది చికెన్ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి అత్యధికంగా రేట్లు నిర్ణయించి విక్రయించేవారు. అయితే గత కొద్ది నెలలుగా పోటీ వ్యాపారులు ముందుకు వచ్చి తక్కువ ధరలకు చికెన్ అమ్మడంతో సిండికేట్ వ్యాపారులు దాడులకు దిగారు. ఈ వివాదం పోలీసు స్టేషన్‌కు చేరింది. దీంతో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డిల మంగళవారం చికెన్ వ్యాపారస్తులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో సిండికేట్ బెడిసికొట్టి బుధవారం చికెన్ ధరలు తగ్గించి కిలో రూ.160 కే బోర్డులు పెట్టి మరీ విక్రయిస్తున్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి దంపతులు

కనుల పండువగా కుంభాభిషేకం

- కొండపై మార్మోగిన లక్ష్మీనరసింహ నామస్మరణ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ప్రముఖుల ప్రత్యేక పూజలు


ఆలయం ఆవరణలో భారీ సంఖ్యలో ఉన్న భక్తులు

కొలిమిగుండ్ల: టీటీడీకి చెందిన వేదపండితుల మంత్రోచ్ఛారణలు, వేలాదిగా తరలివచ్చిన భక్తుల లక్ష్మీనారసింహ నామస్మరణతో కొండ మారుమోగింది. పట్టణ సమీపంలోని కొండపై శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మితమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రామ్‌కో సిమెంట్ కంపెనీ యాజమాన్యం రూ.7కోట్లతో జీర్ణోద్ధరణ గావించారు. ఈనెల 27 నుంచి ప్రారంభమైన మహాసంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం ముగిశాయి. వేదపండితులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆశేష భక్త జనం మధ్య ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. అంతకు ముందుగా కంపెనీ చైర్మన్ వెంకటరామరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జయమ్మ, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సరస్వతి దంపతులు కొండపైకి చేరుకొని స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయాన్ని అభివృద్ధి చేసిన రామ్‌కో చైర్మన్‌ను కాటసాని వారు ఘనంగా సన్మానించారు. వేదపండితులు కాటసాని,ఎర్రబోతుల దంపతులకు ఆశీర్వాదాలు అందజేసి,తిరుపతి లడ్డూలను ప్రసాదంగా అందజేశారు. దేవదాయ శాఖ,రోడ్లు,భవనాల శాఖ మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దనరెడ్డి దంపతులు ఆలయానికి చేరుకోవడంతో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బెంగళూరు నుంచి తెప్పించిన పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణం భక్తులతో కిటకిటలాడింది. రామ్‌కో ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.


రామ్‌కో చైర్మన్ వెంకటరామరాజును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

ఆలయానికి పూర్వవైభవం సంతోషకరం

కొలిమిగుండ్ల: శ్రీకృష్ణదేవరాయల కాలంలో స్థానిక కొండపై నిర్మించిన పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పూర్వవైభవం రావడం సంతోషకరమని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సుమారు 500 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని రామ్‌కో యాజమాన్యం దృష్టికి ఎర్రబోతుల వెంకటరెడ్డి తీసుకెళ్లారని గుర్తు చేశారు. యాజమాన్యం స్పందించి రూ.7కోట్లతో జీర్ణోద్ధరణ చేసేందుకు ముందుకొచ్చారన్నారు. అలాగే తమ కోరిక మేరకు పట్టణంలో రూ.4కోట్లతో ఫంక్షన్ హాల్ పనులు పూర్తి చేశారని, మండల ప్రజల తరఫున వారికి ధన్యవాదాలు తెలిపారు.

గ్రీన్ అంబాసిడర్‌పై కేసు నమోదు

బనగానపల్లె రూరల్ : నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని బీరవోలు గ్రామంలో విధులు నిర్వహించే గ్రీన్ అంబసిడర్ చిన్న రంగయ్యపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన బాలచంద్రుడు అనే యువకుడు ఈ నెల 15న చెత్త తీసుకెళ్లే రిక్షాను తీసెకెళ్లి రోడ్డుకు అడ్డంగా పెట్టాడని చిన్నరంగయ్య దుర్భాషలాడుతూ దాడి చేసినట్లు బాధితుడు బాలచంద్రుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సుపరిపాలన కాదు..రెడ్‌బుక్ పాలన


ఆకుమల్లలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- హామీలిచ్చి మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే
- బాబు వచ్చాడు.. జాబులు పోయాయి..
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధ్వజం
- ఆకుమల్లలో 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ'

సంజామల: అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాలతో సుపరిపాలన అదిస్తామని హామీనిచ్చి పదవి చేపట్టాక..రెడ్‌బుక్ పాలన చేస్తున్నారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మండిపడ్డారు. మండలంలోని ఆకుమల్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి చిన్నబాబు, జిల్లా ప్రచార విభాగ కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఆకుమల్ల సొసైటీ మాజీ చైర్మన్ గౌరిగారి నాగేశ్వర్ రెడ్డితో కలిసి బుధవారం సాయంత్రం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మీద అక్రమ కేసులను నమోదు చేస్తోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మీద ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉండటాన్ని గమనించిన కూటమి ప్రభుత్వం తొలి అడుగు సుపరిపాలన కార్యక్రమం నిర్వహిస్తుందని, అయినా ప్రతి అడుగులో సమస్యలతో కూటమి నాయకులు ఇబ్బంది పడుతున్నారన్నారు. టీడీపీ కార్యకర్తల మెప్పుకోసం అధికారులు పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న హయాంలో ప్రతి ఇంటికి దాదాపు రూ.3 లక్షల పైగానే లబ్ధి చేకూరిందని వివరించారు. బాబు వస్తే జాబు వస్తాదని ప్రజలు నమ్మి ఓటు వేస్తే ఉన్న జాబ్ పీకేసి యువతను గోడాడిస్తున్నారని ధ్వజమెత్తారు.

సంపదలేదు..సూపర్ సిక్స్ లేదు..

సూపర్ సిక్స్ పథకాలు గాలికి వదిలేసి సుపరిపాలన పేరుతో గ్రామాల్లో తిరుగతుంటే ప్రజలు ఎదరు తిరుగుతున్నారని చెప్పారు. ఎన్నికల ముందు సంపద సృష్టించి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పినప్పటికీ అప్పులు తప్ప.. సంపద లేదు.పథకాలు లేవని విమర్శించారు. నలభై సంవత్సరాల రాజకీయ జీవితం అని చేప్పుకునే పెద్దమనిషి పేరు చెబితే ఒక్క పథకమైనా గుర్తుకొస్తుందా అని ప్రజలకు అడుగగా.. లేదని సమాధానమిచ్చారు. అదే వైఎస్సార్, జగనన్న పేరు చెబితే చాలు పథకాల పేర్లు జనాల నోట్ల కంఠతా వస్తున్నాయని చెప్పారు.

తమ హయాంలో గ్రామానికి ప్రత్యేక నిధులు...

వైస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆకుమల్ల గ్రామానికి తన చొరవతో గ్రామం అభివృద్ధి పథంలో నడిచిందని గుర్తు చేశారు. రూ.40లక్షలతో సచివాలయం, రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.1.50 లక్షలతో జెడ్పీ ఉన్న పాఠశాల అభివృద్ధి, రూ.6 లక్షలలో ప్రాథమిక పాఠశాల అభివృద్ధి, రూ.12 కోట్లతో గ్రామం నుంచి అవుకు మండలం శివవరం గ్రామం మీదుగా బనగానపల్లె రోడ్డు, 2013లో రూ.55 లక్షలతో గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి, రూ.5లక్షలతోఉచిత మినరల్ వాటర్ ప్లాంట్, రూ.55 లక్షలతో ప్రభుత్వ గోదాము, గ్రామంలో దాదాపు రూ.2 కోట్లుతో సీసీ రోడ్ల పనులు చేయించామని గుర్తు చేశారు. వైస్సార్‌సీపీ నాయకులు, ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకటరామిరెడ్డి, ఉయ్యాలవాడ ఖాశిం బాషా, పేరం వెంకటేశ్వర రెడ్డి, ఎస్సీ బాబు, అయ్యపురెడ్డి, సత్యమయ్య, నరసింహా రెడ్డి, రమేశ్ రెడ్డి, మంచాల నాగేశ్వర రెడ్డి, ఎద్దుల మోహన్ రెడ్డి, తులసిరెడ్డి, ధర్మారెడ్డి, నారయణరెడ్డి, మల్లికార్జున రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, శీలారెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల వెల్లువ..

ఇంటింటికీ తిరిగే క్రమంలో కాటసాని రామిరెడ్డికి స్థానిక మహిళలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. పలు కాలనీల్లో సమస్యలను వివరించేందుకు గుంపులుగా తరలిరావడం విశేషం. తన కుమార్తె దీక్షిత 3వ తరగతి చదువుతుందని..తల్లికి వందనం పథకం వర్తించలేదని గ్రామానికి చెందిన స్వరూప వాపోయింది. గ్రామ సచివాలయం, పాఠశాలలో టీచర్ల దృష్టికి తీసికెళ్లినా ఆన్‌లైన్‌లో పేరు చూపడంలేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అర్హులమైనా పింఛన్లు రావడం లేదని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు కాటసాని దృష్టికి తెచ్చారు. ఎస్సీ కాలనీలో నీటి సమస్య వేధిస్తుందని స్థానికులు వివరించారు.

ఉడకని అన్నం.. నీళ్లచారు..

- మా కడుపు మాడుస్తున్నారన్నా..
- హాస్టల్ విద్యార్థుల ఆవేదన


బీసీ బాలుర వసతిగృహంలో చిరిగిన బ్యాగ్‌లను చూపుతున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: ఉడకని అన్నం.. నీళ్ల చారుతో కడుపుమాడుస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సీ కళాశాల హాస్టల్, బీసీ బాలుర వసతి గృహాలను సందర్శించారు. ఆ విభాగం మండల అధ్యక్షుడు గున్నాల శేష జశ్వంత్‌రెడ్డితో పాటు కమిటీ సభ్యులు సమీర్, చరణ్, మహిధర్, ఓబులేసు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గోపిరెడ్డి నాగేశ్వరరెడ్డి సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల హాస్టల్‌లో 11 మంది విద్యార్థులే ఉన్నప్పటికీ మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని చిన్నారులు వాపోయారు. కొన్ని సమయాల్లో హాస్టల్‌లో భోజనం పెట్టకపోవడంతో

బయట హోటళ్లలో డబ్బులు పెట్టి తింటున్నామని చెప్పారు. అలాగే హాస్టల్‌ను అద్దె భవనంలో నిర్వహిస్తున్నప్పటికీ బాత్‌రూంలు, మరుగుదొడ్లను శుభ్రం చేయడం లేదని, బాత్‌రూంలకు తలుపులు కూడా లేవని చూపించారు. హాస్టల్ వార్డన్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీసీ బాలుర వసతిగృహాన్ని సందర్శించగా ఈ ఏడాది ఇచ్చిన స్కూల్ బ్యాగ్‌లు సరిగా లేవని చిరిగిన బ్యాగులను చూపించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



డోన్ : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు శకుంతలారెడ్డి అన్నారు. మాజీ అధ్యక్షురాలు ముడియాల శైలజ, వైఎస్సార్‌సీపీ నాయకులు ముడియాల నాగభూషణంరెడ్డిల సహకారంతో గాయత్రీ నగర్ సాక్షి నివాస్‌లో బుధవారం 40 మొక్కలను నాటారు. ముడియాల శైలజ మాట్లాడుతూ.. ప్రజా ఆరోగ్యం కోసం ఆక్సిజన్ అందించే పలు రకాల మొక్కలను కడియం నర్సరీ నుంచి తెప్పించి నాటడమే కాక వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తామే తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి విజయలక్ష్మి, సభ్యులు అనురాధ, రాజేశ్వరి, లీలా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయం పెంచాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ

కోవెలకుంట్ల: వివిధ ఆదాయ వనరులను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలని జిల్లా పంచాయతీ అధికారిణి లలితాబాయి సూచించారు. బుధవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం పట్టణ శివారులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం ఆవరణలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో తడిచెత్త, పొడిచెత్త వేరు చేసే పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ వర్మీకంపోస్టును రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయాన్ని చేకూర్చాలన్నారు. ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

బనగానపల్లె రూరల్ : విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని నంద్యాల దిశ పోలీసు స్టేషన్ సీఐ గౌతమి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజికా సత్యప్రపూర్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, బాల్యవివాహాలు,సైబర్‌క్రైంపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయరాదన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ఆనందరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆవుకు అంత్యక్రియలు

బేతంచెర్ల : పట్టణంలో సంజీవనగర్ కాలనీలో ఓ ఆవు మరణించింది. కాలనీకి చెందిన యువకులు, బజరంగదళ్ సభ్యులు ఆవుకు సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియల నిర్వహించారు.

బాబును బకరా చేసి ఆడిస్తున్న మోదీ

డోన్ టౌన్ : ప్రధాన మంత్రి మోదీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును బకరా చేసి ఆడిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు విమర్శించారు. ఢిల్లీ, ముంబాయి నగరాలు ఉన్నా బీజేపీ ప్రభుత్వం ఏపీ లోనే అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించడానికి బాబు బకరా ఉన్నాడనే గ్రహించిన మోదీ వందల కోట్లు ఖర్చు చేయించాడని ఆరోపించారు. బుధవారం డోన్ పట్టణంలో జరిగిన నంద్యాల జిల్లా రెండవ మహాసభలకు హాజరైన నాయకులు మాట్లాడుతూ ఇందులో భాగంగా ఆగస్టు 5వ తేదీన స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ విద్యుత్ కార్యాలయాను ముట్టడిస్తున్నట్లు తెలిపారు. పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వడానికి చేతులు రాని సీఎంకు విజయవాడ నడిబొడ్డులో ఉన్న ఆర్టీసీ స్థలాన్ని లూలూ కంపెనీకి 99 సంవత్సరాలకు లీజుకు ఇచ్చారని, ఆయన ఐదు ఎకరాల్లో అమరావతిలో ఇళ్లు కట్టుకుంటున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఎల్లయ్య, నక్కి లెనిన్‌బాబు, పట్టణ, మండల కార్యదర్శులు మోటా రాముడు, నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న వారినే ఎంపిక చేయాలి

డోన్ టౌన్ : డోన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అర్హత ఉన్నవారినే ఎంపిక చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేబారాణి, సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి శివరామ్, పట్టణ అధ్యక్షులు నక్కి శ్రీకాంత్, అంగన్‌వాడీ డోన్ సెక్టార్ యూనియన్ అధ్యక్షురాలు సులోచనమ్మ కోరారు. బుధవారం సీడీపీఓ శంషాద్‌బేగంకు వినతి పత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఎల్‌ఎం కాంపౌండ్‌లో నివాసం ఉంటున్న ఏసేబు (55) గడేకారిగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి సైకిల్‌పై బహిర్భూమికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్కెట్‌యార్డు సమీపంలో కోవెలకుంట్ల వైపు నుంచి వెళ్తున్న స్కూటి వేగంగా ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో వాహనదారుడైన పట్టణానికి చెందిన సనా ఉల్లాఖాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పాత్రికేయుడికి గాయాలు

డోన్ టౌన్ : ఓ ప్రైవేట్ చానల్‌లో పాత్రికేయుడిగా పని చేస్తున్న రంగన్న బుధవారం కర్నూలు సమీపంలోని పెద్దటేకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం రంగన్న కుటంబసభ్యులు, సమీప బంధువులతో కలిసి ఆటోలో కర్నూలుకు వెళ్లి.. తిరిగి డోన్‌కు వస్తుండగా కర్నూలు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను వెనుక తాకగా అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోల ఉన్న రంగన్నతో పాటు మరి కొందరు గాయపడగా చికిత్సల నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించారు.

మంచినీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పైపులైన్ పనుల కారణంగా పట్టణంలో రెండు రోజులపాటు తాగు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వైఎస్‌నగర్‌లోని రైల్వే ట్రాక్ వద్ద 400 ఎంఎం ఎంఎస్ పైపులైను మరమ్మతులకు గురి కావడంతో దాని స్థానంలో కొత్తపైపు లైను ఏర్పాటు చేస్తున్నారన్నారు. గురు.శుక్ర వారాల్లో పట్టణంలోని చిగురమానుపేట జీఎల్‌ఎస్ఆర్ నీటి ట్యాంకుకు నీటి సరఫరా ఉండదని, దీని కారణంగా 12, 13, 14, 15, 16, 17 వార్డులల నీటి సరఫరా ఉండదన్నారు. ఆగస్టు 2వ తేదీన యథావిధిగా నీటిసరఫరా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

పాలేరు వాగులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు– ఉప్పలూరు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న పాలేరువాగులోకి బుధవారం సాయంత్రం ఓ ట్రాక్టర్ దూసుకెళ్లింది. మండలంలోని కలుగొట్లకు చెందిన సుధాకర్‌రెడ్డి ట్రాక్టర్‌తో పొలంలో సేద్యం చేసి తిరిగి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో పాలేరు వాగు సమీపంలో ట్రాక్టర్ ఇంజిన్ అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తమై ట్రాక్టర్ నుంచి దూకడటంతో ప్రాణపాయం తప్పింది. రేవనూరు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

శుభకార్యం

బనగానపల్లె: మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకుల కుమారుల వివాహ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన నాయకుడు బాలవెంకటేశ్వర్లు కుమారుడు చంద్రకాంత్ వివాహ వేడుకల్లో రామిరెడ్డి పాల్గొని చంద్రకాంత్‌ను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, గ్రామ నాయకులు సురేష్‌రెడ్డి,శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

బేతంచెర్ల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆగస్టు 3న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలన్నారు.